సమగ్ర జాతీయ తెలుగు దిన పత్రిక
# వికసిత తెలంగాణ
మార్పు కోసం..
ఆదివారం 28 ఏప్రిల్ 2024 పేజీలు: 4 సంచిక: 122



## ఓ ప్రైవేటు పాఠశాలలో

# రహస్య నిఘా నేత్రాలు

"ఓ ప్రైవేటు పాఠశాలలో రహస్య నిఘా నేత్రాల వార్త జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది, సమస్యను దారి మళ్లించి అధికారులు నీకింత, నాకింత అన్న చందంగా వ్యవహరిస్తున్నారు."

- పాఠశాల యాజమాన్యంపై చర్యలేవీ
- డబ్బుతో బాధితుల సమస్య తీరినట్లేనా?
- అధికారుల విచారణలో తేలిన అంశాలేమిటి?

**భద్రాద్రి (వికసిత తెలంగాణ), డిసెంబర్ 08:** భద్రాద్రి జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మహిళా టీచర్లు దుస్తులు సరిచేసుకునే గదిలో, రహస్య కెమెరాలు ఏర్పాటు చేశారన్న వార్త సంచలనం రేపుతోంది. సరిగ్గా పదిరోజుల క్రితం పాఠశాలలోని స్టోర్ రూం లోని సీలింగ్ ఊడిపడడం తో, ఊడిపడిన సీలింగ్ నుండి రహస్య కెమెరాలు బయిటకు రావడం చూసి మహిళా టీచర్స్ ఖంగుతిన్నారు. గమనించిన మహిళా టీచర్లు యాజమాన్యాన్ని నిలదీసినట్లూ తెలుస్తోంది, యాజమాన్యం మాత్రం అక్కడా, ఇక్కడా ఇది స్టోర్ రూం అనీ, పాఠశాల యూనిఫాం, తదితర సామాగ్రి ఉంటుందనీ, ఈ గదిలోకి ఎవ్వరూ రారని కల్లబొల్లి కబుర్లు చెబుతూ బుకాయిస్తోంది. సమస్య నిజమే అయినా యాజమాన్యం మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. అదే గదిలో అటాచ్డ్ బాత్రూం ఉండగా దానినే మహిళా సిబ్బంది వినియోగిస్తుంటారు. వ్యక్తిగత సమస్యలున్న మహిళలు కూడా ఇదే గదిని ఉపయోగించుకుంటారు. 30 మంది మహిళా సిబ్బంది ఉండే పాఠశాలలో, కనీసం మహిళలు ఉపయోగించిన నెలసరి ప్యాడ్లు కాల్చివేసే మిషన్ కూడా లేకపోవడం ఎంతటి దౌర్భాగ్యం. దీన్నంతా చూసి నిస్సహాయ స్థితిలో భయభ్రాంతులకు గురైన ఓ ఇద్దరు మహిళా టీచర్లు 3 రోజుల వ్యవధిలోనే స్వయంగా వెళ్లి మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మండల విద్యాశాఖ అధికారి తదుపరి రోజున ఉదయాన్నే హుటాహుటీన పాఠశాలకు వెళ్లి యాజమాన్య తాయిలాలకు తలొగ్గి, సదరు అధికారి అక్కడేమి కెమేరాలు లేనట్టు మీడియాకు తేల్చిచెప్పారు. కానీ విషయం బయటకు పొక్కడంతో అప్పటికే యాజమాన్యం అప్రమత్తమై రహస్య కెమేరాలు తొలగించడం కొసమెరుపు. ఇంత జరిగినా కనీసం ఈ తంతు అంతా జిల్లా విద్యాశాఖాధికారి కి కూడా ఏమీ తెలియకపోవడం, మండల విద్యాశాఖాధికారే అంతా నడిపించడం, సమస్య తీవ్రత దాల్చడంతో పై అధికారికి తెలపడం అంతా ఓ ప్రణాళిక బద్ధంగా సాగింది. రహస్య కెమెరాలు మాత్రమే కాదు, పాఠశాలలోని మహిళా టీచర్లతో జుగుప్సాకరమైన చాటింగ్ లు, ఓర చూపులు, తలొగ్గని వారిపై వేధింపులూ శరా మామూలేననీ జోరుగా ప్రచారం సాగుతోంది. వేధింపులు భరించలేక కొందరు మహిళా టీచర్లు మధ్యలోనే ఉద్యోగం మానేస్తున్నారనీ ఊహాగానాలున్నాయి. యాజమాన్యం మాత్రం తమ తప్పును తాము సరిదిద్దుకోకుండా, టీచర్లదే తప్పున్నట్లు సమస్య బయటకు పొక్కకుండా యాజమాన్యం ఎప్పటికప్పుడు స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి అందరినీ హెచ్చరించడం దేనికి సంకేతం? మండల విద్యాశాఖ అధికారికి పిర్యాదు చేసిన మహిళా టీచర్లకు యాజమాన్యం ఎటువంటి భరోసా కల్పించకపోగా, ఓ డిజిటల్ పత్రికా విలేఖరితో కుమ్మక్కై అధికారులే పైసలు బేరం చేసినట్లు తెలుస్తోంది. ఓ విలేకరే మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేయాలని, ఓ ఇద్దరిని పంపినట్లూ గుసగుసలు వినిపిస్తున్నాయి. అడిగిన ప్రతీ ఒక్కరికీ యాజమాన్యమే అడ్డగోలుగా పైసలు విసిరి, సమస్యను పక్కదోవ పట్టిస్తూ నోర్లు మూయిస్తున్నారన్న చర్చా గూడెంలో ఊపందుకుంది, మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకూ తాయిలాలు ముట్టాయన్న విస్తృత ప్రచారం నడుస్తోంది, ఓ ఆఫీసర్ డ్రైవర్ స్వయంగా యాజమాన్యంతో ఫోన్లో మాట్లాడి బేరం కుదుర్చినట్లు తనకు బేరం కుదుర్చినట్లు లోకల్ ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

### విద్యాశాఖ అధికారుల జగన్నాటకం

జిల్లా వ్యాప్తంగా సమస్య తీవ్ర చర్చకు దారి తీయడంతో, స్వయంగా డీఈవోనే పాఠశాలకు వెళ్లి అక్కడ సిబ్బందితో మాట్లాడినట్లు తెలుస్తోంది, తాము ఎదుర్కొంటున్న సమస్యలన్నీ ఓ తెల్లని పేపర్లో రాసి, సీల్డ్ కవర్లో పెట్టి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. యాజమాన్యానికి భయపడి అక్కడ ఏం రాసివ్వాలో తెలియక, సమస్యలేమీ లేనట్లు పేర్కొనడంతో, రాసిన సీల్డ్ కవర్లు స్వయంగా యాజమాన్యం చేతుల మీదుగా ఇవ్వడంతో, మీరెందుకు ఇస్తున్నారని, తామే తమ సమస్యలను రాసి ఇవ్వాలని జిల్లా అధికారి కోపోద్రిక్తుడైనట్లు తెలుస్తోంది. అదే రోజు పాఠశాల నుండి సీసీ కెమెరాల హార్డ్ డిస్కులు తీసుకెళ్లిన విద్యాశాఖ అధికారులు, రహస్య కెమెరాలు మొబైల్ కు లింక్ అయ్యాయని ఫోన్లు సీజ్ చేసి పరిశీలించాలని కోరుతుంటే, తరగతి గదుల సిసి కెమెరాల హార్డ్ డిస్క్ లు తీసుకెళ్ళడం ఏంటనీ, ఇదంతా బ్రహ్మాండంగా విచారణ జరిపామని అనిపించుకోవడానికేనా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. సదరు యాజమాన్యం ఫోన్లు పరిశీలించకుండా సమస్య మూలాన్ని ఎలా గుర్తిస్తారో వాళ్ళే చెప్పాలి.